# అభిమానం హద్దుమీరితే

రాంబాబూ, సోంబాబూ మళ్లీ చాలాకాలం తర్వాత అనుకోకుండా కల్సుకున్నారు.

రేషన్‌దుకాణం దగ్గర క్యూలో నిలబడిన రాంబాబుని ముందుగా సోంబాబే చూశాడు. 'హలో'... అని పలకరించాడు.

అప్తమిత్రుడు కనిపించి, అలా పలకరించే సరికి, అంతకు ముందు గంటన్నర నుంచీ క్యూలో నిలబడి పొందిన అలసటనంతా అరక్షణంలో మరచిపోయాడు రాంబాబు.... వెయ్యేనుగుల బలం వచ్చినట్టనిపించింది అతనికి.

"క్యూలో నిలబడ్డావేమిటి?" – అని అడిగేడు సోంబాబు, మిత్రుని దగ్గరగా వచ్చి.

"ఇవ్వాళ పంచదార ఇస్తున్నారు గురూ!" – ఉత్సాహంగా చెప్పేడు.

"అది కరెక్టేననుకో! ఈ డ్యూటీ మీ ఆవిడకు వేసెయ్యలేకపోయావా?" – మళ్ళీ అడిగేడు సోంబాబు.

ఆ ప్రశ్న వినగానే – రాంబాబు ముఖకవళికలు మారిపోయాయి. కళ్ళల్లోకి ఉబికి వస్తున్న కన్నీటిని దాచుకోవాలని ప్రయత్నం చేశాడు.

అయినా సోంబాబు పసిగట్టేశాడు.

"ఏమిటి గురూ?... అలా బిక్క ముఖం వేశావేమిటీ?... ఏం జరిగిందసలూ?" భుజం మీద చేయి వేసి ఆత్రంగా అడిగేడు.

ఏం జరిగిందో – అంతమంది చుట్టూ వుండగా చెప్పటానికి కొంచెం సిగ్గుపడ్డాడు రాంబాబు.

కానీ జరగరానిదేదో జరిగేవుంటుందని సోంబాబు అర్థం చేసుకోగలిగేడు. ఇప్పుడు రాంబాబుకి తన సానుభూతి కావాలి. తన ఓదార్పు కావాలి!... లేకపోతే తాను నిజమైన స్నేహితుడు కాదు! అందుకే – ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చేడు సోంబాబు.

"ఓకే! పంచదార తర్వాత తీసుకుందువు గానీలే! నాతోరా!... అలా ఆనంద్‌భవన్ కెళ్ళి కాఫీ తాగుదాం!" – అంటూ రాంబాబుని ఆహ్వానించాడు.

అప్తమిత్రుని ఆహ్వానాన్ని కాదనలేక పోయాడు రాంబాబు.

"ఇప్పుడుచెప్పు! అసలేంజరిగిందో!" రోడ్డుమీదికొచ్చింతర్వాత అడిగేడు సోంబాబు.

"మా ఆవిడ పుట్టింటికి వెళ్ళిపోయింది సోంబాబూ"! – రాంబాబు గొంతు, ఆమాటలంటుంటే వణికింది.

"ఎందుకనీ?... ఏం జరిగిందీ?"

"ఏం లేదు... ఆఫ్ట్రాల్... వడ్ల గింజలో బియ్యపుగింజ!... నాలుగు రోజుల క్రితం 'ఆకలిరాజ్యం' సినీమాకి వెడదామంది... నేను వద్దన్నాను... అయినా విన్లేదు! తప్పనిసరిగా చూసి తీరాలని పట్టుబట్టింది.... కావాలంటే 'ప్రేమసింహాసనం' చూపిస్తాను తప్ప, ఆకలి రాజ్యానికి తీసుకెళ్ళనని ఖచ్చితంగా చెప్పేను. 'ప్రేమసింహాసనంలో ఏముందని' అడిగింది. 'ఎన్టీఆర్' వున్నాడని చెప్పేను.... కానీ ఆకలిరాజ్యంలో కమల్‌హాసన్ వున్నాడని చెప్పింది.... 'ఏమయినాసరే – నేనే మొగుణ్ణీ మొగాణ్ణీ కనక నామాటేచెల్లాలని' వాదించాను... వింటేనా?.... 'అంతకీ కావాలంటే అరవం సినీమా అయినా చూస్తానుగాని ఎన్టీఆర్ సినీమా మాత్రం చూడను' – అని శపథం చేసింది... అక్కడితో అగిందనుకున్నావా?.... 'కట్టుకున్న పెళ్ళాం కొండంత కోరికపడి – కమల్‌హాసన్ సినీమా చూపించమని అడిగితే – కాదూకూడదని కసిరిపారేసే మొగుడితో కాపరం చెయ్యటం కంటే – కనక దుర్గా విలాస్‌లో పప్పురుబ్బుకుంటూ బతకటం బెటరని' ఛాలెంజ్ చేసింది.... దాంతో నాకు ఒళ్ళు మండిపోయింది.... అలా అయితే 'ఆ పనే చేసుకుంటూ రోజూ ఆకలిరాజ్యం చూడమని' కసిరికొట్టేను... అంతే!.... పెట్టేబేడా పుచ్చుకొని ఇంట్లోనుంచి వెళ్ళిపోయింది....!" చెప్పటం ముగించి – జేబులోంచి కర్చీఫ్ తీసుకుని కళ్ళు తుడుచుకున్నాడు రాంబాబు.

అంతా విన్నతర్వాత అతనిపై ఎలాంటి సానుభూతీ కలుగలేదు సరికదా, కొంచెం కోపం కూడా వచ్చింది సోంబాబుకి.

"అయినా నీ వరస నాకేం నచ్చలేదు గురూ! –" అన్నాడు.

"అయితే తప్పంతా నాదేనంటావా?" అమాయకంగా అడిగేడు రాంబాబు.

వెంటనే జవాబు చెప్పలేదు సోంబాబు.

ఇద్దరూ ఆనందభవన్ చేరుకున్నారు. ఓ మూల ఖాళీగావున్న చోట సెటిలయ్యారు.

"ఏం కావాలిసార్?" మంచినీళ్ళ గ్లాసులు బల్లమీద పెడుతూ అడిగేడు సర్వర్.

"రెండు దోశ!" – ఆర్డరిచ్చాడు సోంబాబు.

అక్కణ్ణించే – ఆ ఆర్డర్ని లోపలి 'కిచెన్' లోకి పంపించేడు సర్వరు.

"నీకు 'ఎన్టీఆర్' అంటే అంత అభిమానం ఎందుకో నాకు అర్థం కాకుండా వుంది." – సిగరెట్టు వెలిగించుకుంటూ ప్రారంభించాడు సోంబాబు. అయోమయంగా అతని వైపు చూశాడు రాంబాబు.

"అవును గురూ! నువ్ అనవసరంగా 'ఎన్టీఆర్'ని అభిమానిస్తున్నావ్... అక్కినేని నటనముందు ఎన్టీఆర్ ఎందుకు చెప్పు...? ఈ విషయం గురించి ఇదివరక్కూడా మనం ఓసారి రిక్షాలో వాదించుకున్నాం. అయినా నువ్ నీ మనసు మార్చుకోలేదంటే ఐ పిటీ యూ!" – అన్నాడు గట్టిగా దమ్ము లాగి పొగ పైకి ఊదేస్తూ.

"నీకు తెలీదు సోంబాబూ! ఇంత వయసొచ్చినా – ఎంతో యాక్టివ్‌గా యాక్ట్ చేస్తున్నాడు ఎన్టీఆర్!... అసలు 'సర్దార్ పాపారాయుడు' పిక్చరు చూశావంటే నీకు మతి పోతుంది!... ఓ వైపు తండ్రి వేషం.... మరో వైపు కొడుకు వేషం!.... ఇద్దరి మధ్యా ఘర్షణ... మానసిక సంఘర్షణ!... ఏ పాత్రకా పాత్రను – ఎంతో రసానుభూతితో యాక్ట్ చేశాడు... నేను పంథొమ్మిది సార్లు చూశాను... నా మాట విని నువ్ ఒక్క సారి చూడు.... నీ మతి పోక పోతే నన్నడుగు!"

"వద్దు గురూ! నా కలాంటి శిక్ష విధించకు... అక్కినేని పిక్చరయితే పంథొమ్మిది సార్లు కాదు – నూట పంథొమ్మిది సార్లయినా చూస్తాను ... అంతెందుకూ?... శ్రీవారి ముచ్చట్లు చూడు... అందులో ఆయన 'స్టెప్స్' వేశాడూ – తినేశాడనుకో!... ఈ వయసులో కూడా అంత ఛలాకీగా స్టెప్స్ వేస్తూ హీరోయిన్స్ కంటే అద్భుతంగా డ్యాన్స్ చేస్తున్నాడంటే – హాట్సాఫ్ ఫర్ హిజ్ టాలెంట్"

"ఆ లెక్కన నీకు 'ఎన్టీఆర్' గురించి అసలేం తెలీదన్న మాట!... 'గజదొంగ' చూడు తెలుస్తుంది... లేక పోతే డ్రైవర్ రాముడు చూడు అర్థమవుతుంది... హీరోయిన్‌తో కలసి ఆయన స్టెప్స్ వేస్తూంటే – హాల్లో బోలెడంత మంది ప్రేక్షకులు ఉత్సాహం పట్టలేక తెరమీదకు డబ్బులు విసిరేసారు!..."

ఆ మాటతో సోంబాబుకి ఉక్రోషం వచ్చింది...

"వీధిలో ఆ సినీమాల తాలూకు వాల్ పోస్టర్ల మీద – మట్టి ముద్దలు వేశారు – నువ్ చూడలేదు కాబోలు!" అన్నాడు.

"అది గిట్టని వాళ్ళు చేసే పని!... ఆ మాటకొస్తే మా వీధి మొగలో 'ప్రేమాభిషేకం' వాల్ పోస్టర్ల మీద కూడా మట్టిముద్దలు కనిపిస్తాయి...వచ్చి చూడు!"–రాంబాబు సవాల్ చేసేడు.

"నువ్వెన్నైనా చెప్పు గురూ!... 'ఎన్టీఆర్' ఎన్టీఆరే... 'అక్కినేని' అక్కినేనే!" –

"ఆ మాట మాత్రం నిజం! అక్కినేని ఎప్పటికీ అక్కినేనే!... 'ఎన్టీఆర్' లాగా మాత్రం యాక్ట్ చెయ్యలేడు..." మంచినీళ్ళగ్లాసు తీసుకుంటూ అన్నాడు రాంబాబు.

సరిగ్గా అదే క్షణంలో అక్కడకు వచ్చిన సర్వర్ – రాంబాబు చేతిలోంచి ఆ మంచి నీళ్ళగ్లాసును విసురుగా లాగేసుకున్నాడు.

రాంబాబూ సోంబాబూ కూడా బిత్తర పోయారు.

"మీ గోలంతా విన్నాను–" గ్లాసులో మంచినీళ్ళన్నీ ఒక్క గుక్కలో తాగేసి మరీ అన్నాడు సర్వరు.

"వింటే విన్నావ్! చేతిలో గ్లాసు లాక్కుంటావేమిటీ–" అతనిమీద కోప్పడ్డాడు రాంబాబు.

"మీరు 'ఊరుకి మొనగాడు' చూశారా?" – వాళ్ళిద్దరి వైపూ ఉరిమి చూస్తూ ప్రశ్నించాడు సర్వరు....

"చూళ్ళేదు!" రాంబాబూ, సోంబాబూ ఒకేసారి జవాబిచ్చారు.

"ఎందుకని?" – బల్లగుద్ది మరీ అడిగేడు సర్వరు.

"మా ఇష్టం!... 'క్రిష్ణ' పిక్చర్లు మేం చూడం!" చివరి వరకూ కాలిన సిగరెట్టు పీకను కాలి క్రింద వేసి నలిపేస్తూ అన్నాడు సోంబాబు.

"క్రిష్ణ కంటె నేను బెటరు!" – కాలరు సర్దుకున్నాడు రాంబాబు.

"తగ్గవయ్యా తగ్గు!... ఇది కాఫీ హోటలయిపోయింది కనక వూరుకుంటున్నాను... లేకపోతేనా? ఆమాటన్నందుకు నీ నాలిక తెగ్గోసేవాణ్ణి! అంతే కాదు. "రామా టాకీసులో కుర్చీకి కట్టేసి – ఆసినిమాని వరసగా మూడాటలూ చూపించేవాణ్ణి!"

"నేను గట్టిగా తల్చుకుంటే రామా టాకీసుకి లైసెన్సు 'కేన్సిల్' చేయించ గలను... ఆ దెబ్బతో మీ 'ఊరికి మొనగాడు' డబ్బాలు మెడ్రాసు మెయిలెక్కుతాయి... ఇంక అట్టే వాదించక దోశ రెడీ అయిందేమో పట్రా!" అంటూ ఆర్డరేశాడు సోంబాటు.

"నా అభిమాన నటుణ్ణి అవమానించిన వారికి – దోశకాదుకదా – ఈ హోటల్లో పచ్చిమంచినీళ్ళు కూడా ఇవ్వను!... పొండి!" – అంటూ వాళ్ళిద్దరి చొక్కా కాలర్లూ రెండు చేతులతోటీ పట్టుకుని – బయటకు తోసేశాడు సర్వరు.

సోంబాబుకి తల కొట్టేసినట్టు అనిపించింది.

"రేయ్! .... ఆఫ్టాల్ ఆనందభవన్‌లో సర్వరు గాడివి... నీకింత పొగరా? బయటికి రారా చెప్తాను!... ఎముకలు విరిచి బస్తాలోకట్టి రామదాసు ట్రాన్స్‌పోర్టులో వేసి – నీ అభిమాన హీరోకి పార్శెల్ చేస్తాను... రారా!" – పిచ్చివాడిలా అరిచేడు సోంబాబు. ఎలాగో అతనికి నచ్చచెప్పి– ఆ పక్కనున్న మరో హోటల్‌కి తీసుకుపోయాడు రాంబాబు... ఈ లోగా ఆనందభవన్‌లో కౌంటరు దగ్గర కూర్చున్న – ప్రొప్రయిటరు జోగినాధం – సర్వర్ని పిలిచాడు.

"ఏమిటీ గొడవంతా?" – అని కళ్లెర్ర చేశాడు.

"మరేం లేదు సార్! వాళ్లిద్దర్లో ఒకరు ఎన్టీఆర్ గొప్పతనం గురించీ, ఇంకొకరు అక్కినేని గొప్పతనం గురించీ వాదించుకుంటూంటే – 'కృష్ణ గురించి తెలుసా?' అని

అడిగేనండి.... అసలు 'క్రిష్ణ' పిక్చర్లే వాళ్లు చూడరట... అలాంటి వాళ్ళకు ఈ హోటల్లో పచ్చి మంచినీళ్ళు కూడా దొరకవ్, పొమ్మన్నానండి!" - చెప్పేడు సర్వరు సగర్వంగా.

అంతా శ్రద్ధగా విని - 'ఇలారా' - అని సర్వర్ని దగ్గరకు పిలిచాడు ప్రొప్రయిటరు జోగినాథం.

సర్వరు రెండడుగులు ముందుకు వెళ్లేడు.

"నువ్ 'ఖైదీబాబాయ్' చూశావా?" - సీరియస్‌గా అడిగేడు జోగినాథం. లేదన్నట్లు తల అడ్డంగా తిప్పేడు సర్వరు.

"పోనీ 'మానవుడూ - దానవుడూ' చూశావా?"

"లేదండి!"

"కార్తీకదీపం" కూడా చూడలేదా?"

"లేదండి!"

"పోనీ ఈ మధ్య వచ్చిన 'దీపారాధన' చూశావా?"

మళ్లీ తల అడ్డంగాతిప్పేడు సర్వరు.

జోగినాథానికి కోపం వచ్చేసింది...

"ఏం? అవన్నీ ఎందుకు చూళ్ళేదు?" పళ్ళు పిండుకుంటూ అరిచేడు.

"చిత్తం! శోభన్‌బాబు సినీమాలంటే నాకు గిట్టవండి!" - ధైర్యంగా చెప్పేడు సర్వరు.

రెండు క్షణాలపాటు ఆశ్చర్యపోయిన జోగినాథం - ఆ తర్వాత ఒక నిర్ణయానికొచ్చి అడిగేడు.

"నువ్ పనిలో ఎప్పుడుచేరేవ్?" అని.

"ఇవాల్టికి నాలుగురోజులయిందండి"

"ఆల్‌రైట్!... ఈ నాలుగు రోజులుకీ నీకు పదహార్రూపాయలొస్తాయి... ఇంద... తీసుకుని వెళ్ళిపో!... శోభన్‌బాబు సినీమాలు చూడనివాళ్ళు నా హోటల్లో సర్వర్లుగా పనిచేయటానికి వీల్లేదు!... గెరవుట్!" - అంటూ సర్వర్ని బయటకు గెంటేశాడు జోగినాథం.

(నాడూ - నేడూ కూడా నటీనటులకు అభిమానులూ అభిమాన సంఘాలూ ఉన్నాయి. అయితే ఒకప్పటి అభిమానులకూ ఈనాటి అభిమానులకూ చాలా వ్యత్యాసం వుంది. ఇవాళ ఎందరో అభిమానులు- తమ సంఘాల ద్వారా అనేక సందర్భాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు... ఇది శుభ పరిణామం... కానీ పూర్వం పరిస్థితి ఇలా వుండేది కాదు... కొన్ని కొన్ని సందర్భాల్లో వారి అభిమానం హద్దులమీరుతూండేది... ఆ నేపథ్యాన్ని ఆధారంగా తీసుకుని పాతికేళ్లక్రితం రాసిన కథ ఇది. కథాగమనం కోసం పఠనాసక్తి

కోసం - కథలో కొంతమంది ప్రముఖ నటుల పేర్లు తప్పనిసరిగా వాడాల్సి వచ్చింది... ఆ పేర్లు వాడకపోతే కథలో మజావుండదు... కనక సరదాగ చదువుకుని - 'లైటర్‌వీన్' లో తీసుకోవాలని అభ్యర్థన - )

- రచయిత

(హాస్యప్రభ - మే 1981)

## నాకు తెలిసిన జీడిగుంట...

మిత్రులు జీడిగుంట రామచంద్రమూర్తి గత పాతికేళ్లుగా రాస్తూనే వున్నారు. ఇంకా ఇంకా రాస్తూనే వుంటారు. ఆ గ్యారంటీ యివ్వగలను. మూర్తిగారితో మీకు పరిచయముందో లేదో నాకు తెలీదు. ఒకసారి అతన్ని కలవండి. అతను మాట్లాడే అరగంటలో పాతిక నిమిషాలు కేవలం కథలు గురించే వుంటుందని బాండ్ పేపరుమీద రాసిస్తాను.

ఇష్టమైన వంటకాన్ని ఊరిస్తూ వల్లించి చెప్పే పెద్దమనిషిగా - రామచంద్రమూర్తి ఏ కథ చెప్పినా ఊహిస్తూ చెబుతారు. ఆ కథలో బాగా కమిటైపోతారు. ఆ పాత్రల్లో సంఘటనల్లో తనూ ఒకరైపోతారు. కథంటే అంత యిష్టం అతనికి...

కథే నాప్రాణమని డిక్లేర్ చేసే లెవల్‌కి అతను ఎదిగిపోయారు. అంచేత - అతను ఏ కథ రాసినా చెప్పినా - అందులో ఒక ఉద్వేగముంటుంది. కథారచన పట్ల అతని ఆరాధన తళుక్కుమంటుంది. అల్లాంటివాళ్ళు ఏ కథ రాసినా అందంగానే వుంటుంది.

నాకు తెలిసినంత వరకు...

జీడిగుంట రామచంద్రమూర్తికి కథా కరువులేదు. అతను కథానిధి. ఒకటి రాస్తే రెండు రెడీగా వుంటాయి. కథా సిరితో అతను కళకళలాడే రచయిత. అంచేతనే పాతికేళ్ళుగా రాస్తున్నాడు. మరో మూడు పాతికేళ్ళకి సరిపడే కథలు దాచుకున్నారు.

ఆదివిష్ణు

4-3-1985

(రచనా వ్యాసంగ రజితోత్సవ సంచిక నుంచి)